## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత సైన్య పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- ❖ సాంకేతిక సహాయంతో పన్ను ఎగవేతలను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు నిర్దేశించారు.
- ❖ పారిశ్రామిక వేత్తలుగా మారే యువతకు ప్రభుత్వం రాయితీలను అందిస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.
- ❖ తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- ❖ జలవనరుల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రభుత్వం 344 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

====================

భారత సైన్య పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ రోజు పంజాబ్‌లోని ఆదంపుర్ ఎయిర్ బేస్ ను సందర్శించిన సందర్భంగా జవాన్లను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారత సైన్యం శపథం చేసిందని, సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువేనన్నారు. భారతీయులందరూ సైన్యానికి మద్దతుగా నిలబడ్డారని, భారత సేనలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు. భారత శక్తిసామర్థ్యాలు చూసి తన జీవితం ధన్యమైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

సాంకేతిక సహాయంతో పన్ను ఎగవేతలను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 30 సంవత్సరాల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు వివరించారు. ఈ సంవత్సరం లక్షా 34 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం లక్ష్యంగా పెట్టుకోవాలని నిర్దేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఆదాయంలో లోటును పూడ్చుకునే విధంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

====================

తూర్పు గోదావరి  జిల్లా పెద్దాపురం ఏడీబీ రోడ్డు వద్ద ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో 13 కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్క్‌నకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ... విజన్-2047 ద్వారా స్వర్ణాంధ్ర సాధించాలంటే పారిశ్రామిక రంగంలోనూ ప్రగతి చాలా అవసరమన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటు కారణంగా ఉపాధి కల్పన జరగడమే కాకుండా ఆర్థికంగానూ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పారిశ్రామిక వేత్తలుగా మారే యువతను ప్రోత్సహించేందుకు పెట్టుబడి నిధిలో విద్యుత్ బిల్లులతో పాటు చాలా అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీల అందిస్తోందని మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు.

====================

తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దుతామని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆయన ఈ రోజు జిల్లాలోని బిక్కవోలులో కుమార సుబ్రమణ్యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... సైనికులు దేశం కోసం చేస్తున్న త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఆలయాలను సందర్శిస్తున్న పర్యాటకులు అధికంగా ఉన్న నేపద్యంలో టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

====================

పల్నాడు జిల్లాలో ఈ రోజు  ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వినుకొండ మండలం శివాపురం వద్ద లోడ్‌తో వెళ్తున్న బొలెరో ట్రాలీని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలిలో ముగ్గురు మృతి చెందగా.. ఆసుపత్రికి తరలిస్తుండగా మరొకరు చనిపోయారు. మృతులంతా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లికి చెందిన వ్యవసాయ శ్రామికులు పోలీసులు ప్రమాదస్తలానికి చేరుకుని దర్యాప్తు చేపడుతామని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

విరామం

====================

ఇటీవల భారత్ పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండా గ్రామానికి చెందిన సైనికుడు ముడావత్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్స్ పార్టీ  అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ రోజు పరామర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. వీర జవాను మురళీ నాయక్ జీవితం స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన త్యాగానికి ప్రజలంతా రుణపడి ఉండాలని  జగన్మోహన్ రెడ్డి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతున్నదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి ఈ రోజు మంత్రి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రాష్ట్ర పండుగగా ఈ జాతరను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో అన్నీ వర్గాల ప్రజలకు మంచి పాలన అందుతున్నదని, కూటమి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు..

=====================

జలవనరుల నిర్వహణ, మరమ్మతుల కోసం రాష్ట ప్రభుత్వం 344 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని ఆ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. 10 లక్షల రూపాయల ఖర్చు దాటే తూడు, గుర్రపుడెక్క, పూడికతీత వంటి అత్యవసర పనుల కోసం కాలయాపన చేయకుండా, 7 రోజుల్లోనే పనులు పూర్తయ్యేలా షార్ట్ టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. 10 లక్షల రూపాయల లోపు ఉన్న పనులను, సాగు నీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టాలని సూచించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

(వాయిస్ 37 సెకన్లు)

=====================

తిరుమలలో గురువారం నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ రోజు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఈనెల 15వ తేదీ నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని స్పష్టం చేశారు. మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లుగా గతంలో టీటీడీ ప్రకటించింది. వేసవి సెలవుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఆ గడువును తగ్గించి మే 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

=====================

పార్వతీపురం మన్యం జిల్లా ప్రగడ కోటయ్య మెమోరియల్ వెంకటగిరి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థలో 3 సంవత్సరాల హ్యాండ్లూమ్, టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ ఓఎస్డీ ఎస్.గిరిధరరావు తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్.పి.కె.ఎం.ఐ.ఐ.కె.టి.లో 53 సీట్లకు, తమిళనాడులోని సేలం నందు 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్ నందు 4 సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరేందుకు 10వ తరగతి, దానికి తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. జూన్ 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలు, దరఖాస్తు కొరకు www.iihtvgr.com వెబ్ సైట్ ను సందర్శించాలని ఆయన కోరారు.

=====================
=====================